క్లుప్తంగా

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేత



బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న కేసలి అప్పారావు

గుర్ల: మండలంలోని తాతావారి కిట్టాలి అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం సందర్శించారు. చిన్నారులకు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారంపై సీడీపీఓ ఆరుద్రను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు ఆదేశించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ బెల్లాన మంగమ్మ, బెల్లాన రామునాయుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా



తాగునీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఒబ్బిన నాయుడు

కొత్తవలస: మండలంలోని దేవాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మాజీ సర్పంచ్ ఒబ్బిన దేముడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాడ గ్రామంతో పాటూ చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ట్యాంకర్‌తో ఉచితంగా మంచినీటిని సరఫరా చేస్తామన్నారు. అలాగే శుభకార్యాలు, అత్యవసర సమయాల్లో తాగునీరు అవసరమైతే తన ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు. ఆయనతో పాటు గ్రామ పెద్దలు పులిబంటి రాము ఉన్నారు.

అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గజపతినగరం: స్థానిక శ్రీరామా క్షేత్రం జంక్షన్ వద్ద సీతారామస్వామి, వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో శుక్రవారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ ధర్మకర్త కె.సాంబమూర్తి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సుమారు 2వేల మందికి అన్నసమారాధన చేశారు. గజపతినగరంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



ఆసరా మూడో విడత నగదు మంజూరు పత్రాన్ని ఎంపీపీకి చూపిస్తున్న మహిళలు

దత్తిరాజేరు: జగనన్నే మళ్లీ సీఎం కావాలని మహిళలంతా కోరుకుంటున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులంతా శుక్రవారం పెదకాద గ్రామంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని 37 సంఘాలలో ఉన్న 456 మంది సభ్యులకు ఆసరా పథకం కింద మూడో విడతగా రూ.25,70,268లు నగదు ఖాతాల్లో జమకావడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అప్పులు తీర్చేందుకు ఇబ్బందులు పడేవాళ్లమని, కానీ జగనన్న ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేసి ఎంతో మేలు చేశారని అన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి

బొండపల్లి: ఉపాధిపనుల కల్పనలో దేశంలోనే విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం విశేషమని ఎంపీడీఓ ఎ.వేదవతి అన్నారు. మండలంలోని ఒంపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ, వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారా లేదా, చేసిన పనులకు బిల్లులు ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పని దినాల కల్పనలో దేశంలోనే విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినందుకు కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. ఏపీఓ బి.కృష్ణవేణి, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

గజపతినగరం: పార్టీని బలోపేతం చేసేందుకు మండల నాయకులు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు కోరారు. మండలం కేంద్రంలో శుక్రవారం సాయంత్రం బీజేపీ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.



వేపాడ: బొద్దాం సచివాలయంలో సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ సత్యవంతుడు తదితరులు



చీపురుపల్లి: వలంటీర్‌కు ప్రశంసా పత్రం అందజేసి సత్కరిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



బొండపల్లి: గొట్లాంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, తదితరులు

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ రఘురాజు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సేవాపురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటికి చేరవేయడంతో పాటు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కార్యకర్తలుగా వ్యవహరిస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ప్రజలకు పారదర్శక పాలన అందించడంలో గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థ కీలకమని, ఈ రెండు వ్యవస్థలు ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని అన్నారు. అలాగే పలు పంచాయతీల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వలంటీర్లను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

–సాక్షి, గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి



గుర్ల: పెనుబర్తిలో వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



దత్తిరాజేరు: పెదకాదలో వలంటీర్లను సత్కరిస్తున్న నాయకులు, అధికారులు



జామి: వీఆర్‌పాలెంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ ఎస్.అరుణ, ప్రజాప్రతినిధులు



లక్కవరపుకోట: మార్లాపల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసారవు



కొత్తవలస: తుమ్మికాపల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



గంట్యాడ: వలంటీర్లును సన్మానిస్తున్న ఎంపీపీ హైమవతి



గజపతినగరం రూరల్: వలంటీర్లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ గార తవుడు, తదితరులు

ఉత్సాహంగా షటిల్ పోటీలు

శృంగవరపుకోట: మండలంలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన షటిల్ సమ్మర్ క్యాంప్ ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఇంటర్నల్ టోర్నమెంట్ నిర్వహించారు. కోచ్ పి.శ్రీరాములు నేతృత్వంలో సబ్ జూనియర్లు, జూనియర్లు, సీనియర్లు, సూపర్ సీనియర్లుగా విభజించి సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటుతున్నారు. ఈనెల 29 వరకు ఈ పోటీలు కొనసాగుతాయని కోచ్ తెలిపారు.



షటిల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

నేడు క్రికెట్ ప్రీమియం లీగ్

గంట్యాడ: మండలంలోని వసంత గ్రామంలో ఈ నెల 27న ఉదయం 7 గంటల నుంచి టీ10 క్రికెట్ ప్రీమియం లీగ్ నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.8వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న టీంలు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి టోర్నీలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు 9739097875 లో సంప్రదించాలని సూచించారు.

రైతుకు సాయం చేయడమే సర్కారు లక్ష్యం

శృంగవరపుకోట: రైతుకు సాయం చేయటమే లక్ష్యంగా సర్కారు పలు పథకాలను అమలు చేస్తోందని, ఆర్‌బీకే సిబ్బంది వాటిని రైతులకు తెలియజేయడంతో పాటు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో డివిజన్ స్థాయిలో ఆర్‌బీకే సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎంఐపీ, ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. ఉద్యానవనశాఖ డివిజనల్ అధికారి శైలజ, హెచ్‌ఓ అనిత, ఎస్.కోట ఏఓ రవీంద్ర, జామి, ఎస్.కోట, వేపాడ మండలాల అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు హాజరయ్యారు.



మాట్లాడుతున్న పీడీ లక్ష్మీనారాయణ

కనిమెరకలో 'ఫ్యామిలీ డాక్టర్'

బొండపల్లి: మండలంలోని కనిమెరక గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జె.ఝాన్సి, వైద్య సిబ్బంది సుమారు 60 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆరోగ్య సేవలందించారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.



వెళ్లి వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఝాన్సి

1 నుంచి ఐరిస్ ఆధారిత రేషన్

గజపతినగరం: వేలిముద్రలు పడని రేషన్ లబ్ధిదారులకు వచ్చే నెల 1 నుంచి ఐరిస్ ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఎం.అరుణ కుమారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ, గంట్యాడ మండలాల ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. బయోమెట్రిక్ నమోదు సమయంలో వేలిముద్రలు పడనివారికి ఐరిస్ నమోదు చేసి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. అందుకు అవసరమైన ఐరిస్ పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. గజపతినగరం మడలానికి 11, బొండపల్లి 10, మెంటాడ 9, దత్తిరాజేరు 11, గంట్యాడ 13 చొప్పున ఐరిష్ మెషిన్లు వచ్చాయన్నారు. సమావేశంలో పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్ ఉన్నారు.



ఐరిష్ పరికరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇంటర్‌లో ప్రవేశాలకు పరీక్ష రేపు

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలస వద్ద ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీతారాం శుక్రవారం తెలిపారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని సూచించారు. ప్రభు త్వం విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తుండడంతో గత కొన్నేళ్లుగా కళాశాలలో అడ్మిషన్లు పెరిగినట్లు చెప్పారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ

జామి: నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులతో రైతులకు అధిక ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలో శిరికిపాలెం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం విభాగం ఆధ్వర్యంలో తయారుచేసిన నవధాన్యాలు కిట్లను ఏఎంసీ మాజీ చైర్మన్ గుడివాడ రాజేశ్వరరావుతో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 32 రకాల విత్తనాలతో ఈ కిట్లు తయారు చేశామని, మండలంలో అన్ని రైతుభరోసా కేంద్రాల్లో విత్తన కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలని కోరారు. తొలకరి వర్షాలకు ముందు నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు సాగుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది సరోజిని, పద్మ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



శిరికిపాలెంలో నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న ఏఓ కిరణ్‌కుమార్, రాజేశ్వరరావు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జామి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ ఎస్.కృష్ణమూర్తి తెలిపారు. టి.బొడ్డవర 33 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున జామి,పి.భీమసింగి, వీఆర్‌పాలెం, విజినిగిరి, జన్నివలస,శాశనపల్లి,వెన్నె, తాండ్రంగి, తానవరం, చింతాడ, జాగరం, పావాడ, లక్ష్మీపురం గ్రామాలకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, విద్యుత్‌సిబ్బందికి సహకరించాలని కోరారు.

అనధికార లేఅవుట్ల తొలగింపు

గజపతినగరం: మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు సమీపంలో అనధికారికంగా వేసిన లేఅవుట్‌లో రాళ్లను(హద్దులు) తొలగిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.అరుణకుమారి తెలిపారు. ఈ లేఅవుట్‌ను శుక్రవారం సాయంత్రం సందర్శించి సిబ్బంది సాయంతో హద్దురాళ్లను తొలగించారు. అనుమతులు లేకుండా అభివృద్ధి చేసిన లేఅవుట్‌లను తొలగించడంతో పాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అనధికార లేఅవుట్‌లో హద్దురాళ్లను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పూర్తిస్థాయిలో సేవలందించేందుకు కృషి

- ఆర్డీఓ పి.శేషశైలజ

గజపతినగరం: ప్రజలకు పూర్తిస్థాయిలో ఈ–సర్వీసులు అందించేందుకు కసరత్తు చేస్తున్నామని ఆర్డీఓ పి.శేషశైలజ అన్నారు. గజపతినగరం తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. రెవెన్యూ సర్వీసులు అందిస్తున్న తీరుపై తహసీల్దార్ ఎం.అరుణకుమారి వద్ద ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మొదటి ఫేజ్‌లో 100 గ్రామాలను పరిగణలోనికి తీసుకొని శతశాతం ఈ–సర్వీసులు అందించేలా కసరత్తు చేశామన్నారు. అనంతరం మరో 58 గ్రామాలను విజిట్‌కు ఎంపిక చేసుకొని అందులో 13గ్రామాలను పూర్తిచేయడం జరిగిందని, మిగతా గ్రామాల్లో ఈ–సర్వీసులను పూర్తిస్థాయిలో అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పనులు పెండింగ్ లేకుండా రెవెన్యూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. ఈ–సర్వీసులు అందించడంలో బొబ్బిలి ప్రథమ స్థానంలో ఉందని ఆర్డీఓ తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ పి.శేషాశైలజ

మత్తుకు బానిసై జీవితాలు పాడుచేసుకోవద్దు

చీపురుపల్లి: యువత మద్యం, గంజాయి, సిగరెట్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. ఎస్‌ఈబీ ఏఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. మత్తు పదార్థాలు విడనాడండి–విలువైన జీవితాలు కాపాడుకోండి అంటూ నినాదాలు చేశారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గంజాయి, ఖైనీ, గుట్కాలు విక్రయించేవారితో పాటు వాటిని తీసుకునేవారిపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే తక్షణమే 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

అగ్రహారం భూములపై అభ్యంతరాల స్వీకరణ

జామి: అగ్రహారం భూములకు సంబంధించిన అభ్యంతరాలను నెల రోజుల్లో తెలియజేయాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. జామి అగ్రహారం భూములను సర్వే నంబర్ల వారీగా విస్తీర్ణం, అనుభవదారుని పేరు ప్రచురించడం జరిగిందన్నారు. జాబితాలో ప్రచురించిన వివరాల మేరకు రైత్వారీ పట్టాలు మంజూరు చేయడానికి ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నెలరోజుల లోపు ఆధారాలతో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

75 శాతం రాయితీపై పసుగ్రాస విత్తనాలు

జామి: పాడిరైతులకు 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందిస్తున్నామని జామి పశువైద్యశాల డాక్టర్ ఎ.అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. అన్ని ఆర్‌బీకేల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని సూచించారు. 5 కేజీల ప్యాకెట్‌ను రాయితీపై ధర రూ.115కు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పశు బీమా పథకం కింద ఆవు లేదా గేదెకు రూ.30 వేలు బీమాకు సంబంధించి లబ్దిదారుడు మూడు సంవత్సరాల వ్యవధికి రూ.384 ప్రీమియం చెల్లించాలని, రూ.15 వేలు బీమా మొత్తానికి రూ.192 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. గొర్రెలకు, మేకలకు అయితే సంవత్సరానికి రూ.6వేలు బీమా కోసం రూ.36లు ప్రీమియం, రెండు సంవత్సరాలకు రూ.54లు, మూడు సంవత్సరాలకు రూ.75లు ప్రీమియం చెల్లించాలన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పంపిణీకి సిద్ధంగా పశుగ్రాస విత్తనాలు

ఉద్యోగుల సంక్షేమమే ఎన్ఎంయూ లక్ష్యం

శృంగవరపుకోట: ఉద్యోగుల సంక్షేమం కోసమే ఎన్ఎంయూ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి.ఎస్.రాములు అన్నారు. స్థానిక డిపోలో శుక్రవారం ఎన్ఎంయూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ యూనియన్, ఎంప్లాయీస్ యూనియన్‌ల నుంచి వచ్చిన సుమారు 40 మంది ఉద్యోగులను ఎన్ఎంయూలోకి ఆహ్వానించారు. ఉద్యోగుల సమస్యలపై ఎన్ఎంయూ పోరాటం చేస్తుందని, యూనియన్ సభ్యులందరికీ అండగా ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా ఈయూ నుంచి ఎన్ఎంయూలో చేరిన జిల్లా అధ్యక్షుడు జి.ఎస్.రాజును సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.జి.రఫీ, రాజు, ఎ.రాజయ్య, జి.వి.రమణ, వి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాములు